“ఆడపిల్ల పుట్టింది.” ఫోను దించేశాడు రిషి.

స్థైన విశ్వాసంగా తిరుగుతున్న ఫాను. టేబుల్‌మీద రెపరెపలాడుతున్న కాగితాలు. లేచాడు. కుర్చీకి తగిలించి ఉన్న కోటు తొడుక్కున్నాడు.

ఒకసారి ఫైల్సు పరిశీలించి, తను సంతకాలు పెట్టవలసిన వేమయినా మిగిలిపోయాయేమోననే సందేహం తీర్చుకున్నాడు. అర్జెంటు ఫైల్సు చూడడం ఇందాకనే అయిపోయింది.

అసలు ఇందాకట్నుంచి—ఆ మాట కొస్తే ఉదయంనుండీకూడా—ఎదురు చూస్తున్నది ఫోను కోసం. అది మోగడం కోసం.

అది చాలాసార్లు మోగింది.

కానీ, ఆ పిలుపు ఆస్పత్రినుండి కాదు. ఒకసారి పై ఆఫీసరు నుండి, మిగతా వాట్ని ఒంటికి మామూలుగా ఆఫీసు పనిమీద వచ్చే పిలుపులు. రోజూలాగ వాటిమీద శ్రద్ధ చూపించలేక పోయాడు. ‌అయినంత త్వరలో సంభాషణ ముగించాడుకూడా. ఆస్పత్రి వాళ్ళు ఫోను చేసినప్పుడు తను ఎంగేజ్ కాకూడదు.

ఎదురుచూస్తున్న పిలుపు రానే వచ్చింది.

అయితే, ఆశించినంత గొప్పగా లేదు.

అయినా వెళ్ళక తప్పదు. పెదవుల మీద ఇంత నవ్వు పులుముకుని సుశీల ఎదట నిలబడక తప్పదు. తనని అక్కడే ఉండమంది. తనని కళ్ళతో చూస్తూంటే కొండంత ధైర్య మంది. కానీ, తనకి కొండంత అధైర్యం. ఆ మూలుగులు, మొహంలో ముడులు తిరిగే బాధ తను చూడలేడు.

అందుకే, అర్జెంటు పనుల వంక చెప్పి, అనునయించి ఆఫీసుకి వచ్చాడు. వచ్చాడన్నమాటేగానీ, మనిషి ఇక్కడ, మనసు అక్కడ.

కాలింగ్ బజర్ నొక్కాడు.

స్టెనో వచ్చింది. “ఎస్, సర్!” చేతిలో నోట్‌బుక్, పెన్సిల్.

“నేనునర్సింగ్‌హోమ్‌కి వెళుతున్నాను. ఫైల్సు డిస్పాచ్‌కి పంపించు.”

“అలాగే, సార్! ఏమన్నా వార్త తెలిసిందా, సార్?”

కళ్ళు చికిలించి చూశాడు.

“అదే—నర్సింగ్ హోమ్ నుండీ.”

“ఆడపిల్ల” అన్నాడు ముక్తసరిగా.

“హార్టీ కంగ్రాట్స్, సార్!”

“నో... థాంక్స్!” అని దూసుకుపోయాడు.



త్రినేత్రుడు    చిత్రం—పి. ఎస్. స్వామినాథన్ (మద్రాసు-17)

స్టెనో కర్రలా బిగుసుకుపోయింది. ‘వాట్ హాపెండ్?’ అని గొణుక్కుంది మనసులో.

రిషిని చూస్తూనే శాల్యూట్ కొట్టి కారు తలుపు తెరిచాడు డ్రైవరు. కూర్చుని “నర్సింగ్ హోమ్” అన్నాడు.

బాణంలా కదిలింది.

దారంతా మళ్ళీ ఆలోచనలు! పెళ్ళి చూపుల్లో సుశీల... మొదటి రాత్రి సుశీల ... నెలలు నిండిన సుశీల ... బాలింతరాలుగా తను చూడబోయే సుశీల! ప్రతి భంగిమ ఒక రూపచిత్రమై వలయంగా అమరి మనసు చుట్టూ పరిభ్రమించడం.

అది చెదిరిపోయి మరేవో స్మృతులు ముసురుకోవడం.

కారు పరుగెడుతూనే ఉంది.

చుట్టూ చైతన్యం.

కదిలిపోతున్న కారులో మౌనంగా, మూగబోయిన మనసుతో తను.

ఆ మాట చెబుతూ సిగ్గు పడ్డప్పుడు, సుశీల బుగ్గమీద చిటికె వేసి “బాబుని కనాలి. అచ్చం నీ పోలికలతో, నీ అందంతో” అంటే—“నా కేం తెలుసు. నేను దైవశక్తినా తలచిన విధంగా జరిగించటానికి?” అంది.

“నువ్వు దైవశక్తివి కాకపోవచ్చు. కానీ, ఆ శక్తికి చేతులు జోడించి, అర్థించు. ప్రార్థించు. మొక్కుకో.”

నవ్వి “అలాగే” అంది సుశీల.

తను చెప్పినవన్నీ చేసింది.

ఊలు తెప్పిస్తే బాబు కోసం ఓపిగ్గా రాత్రిళ్ళుకూడా నిద్ర మానుకు కూర్చుని స్వెట్టరు, టోపీ, మేజోళ్ళు అల్లింది.

సుశీలకి తెలియకుండా బాబు కోసం ఖరీదయిన లాగూ, చొక్కాకూడా తెచ్చి ఉంచాడు. పుట్టేవాడు సుశీల రంగులో ఉంటే, ఈ బట్టలు అతికినట్టు సరిపోతాయి.

ఎందుకో మెడికల్ షాపు కెళితే, బహుళ ప్రచారం పొందుతున్న గ్లాక్సో వారి ‘ఫారెక్స్’ కొట్టొచ్చినట్టు కనిపించింది. కొనాలనిపించింది.

వెంటనే మూడు డబ్బాలు కొనేశాడు.

బేబీఫుడ్‌కున్న గిరాకీ తనకు తెలుసు. సడన్‌గా ఎప్పుడో స్టాక్ లేదనేస్తారు. చాటు మాటున రెట్టింపు ధరలకుకూడా అమ్మేస్తుంటారు!

ఈ డబ్బాలు కొన్న విషయంకూడా సుశీలకి తెలియదు.

బాబు లాగూ, చొక్కా దాచిన చోటనే ఇవి కూడా దాచాడు. మరేం లేదు—తన పిచ్చికి నవ్వేస్తుందేమోనని భయం.

బాబుకి తనో పది బెంగాలీ పేర్లు రాసి ఉంచుకున్నట్టు తెలిస్తే మరీ నవ్వేస్తుంది! ఏమిటో—ఈ దేవుళ్ళకు కూడా మనిషితో ఆడుకోవడం సరదా. పోనీలే ఏదో మనస్ఫూర్తిగా కోరుకున్నారు కదాఅని కరుణించడం లేదు. ఆడపిల్లట—ఆడపిల్ల!

తను ఆ నాలుగక్షరాలూ వినరా దనుకున్నాడు.

‘మగపిల్లాడు — బాబు పుట్టాడు’ —ఇదీ తను వినదలుచుకున్నది. వినలేక పోయింది!

రెండు కిలోల స్వీట్లకి ఆర్డరిచ్చాడు, ఆఫీసు సిబ్బందికి పంచాలని. అందరూ తనని “లక్కీమాన్” అనేస్తూంటే, ఛాతీ రెట్టింపై, ఆనందజ్యోత్స్నలతో మొహం నిండిపోగా ఏమేమిటో ఊహించాడు.

కాదు— కలలు కన్నాడు.

ఏవీ— ఏమైనాయి ఆ కలలు?

“నర్సింగ్ హోమ్ కొచ్చాం, సార్!” అలా డోరు తెరిచి ఎన్ని క్షణాల నుండీ పట్టుకున్నాడో డ్రైవరు పరధ్యానంలో తను గమనించనే లేదు.

“ఓ. . .” అంటూ దిగాడు.

టక టక నడుచుకుంటూ వెళ్ళాడు.

డాక్టర్ కిషోర్ ఎదురుగా వస్తూ కనిపించాడు.

“నమస్తే.” ఒకరి నొకరు విష్ చేసుకున్నారు.

“చిన్న పొరపాటు జరిగింది. మా హెడ్‌నర్సు మీకు రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చింది. మీకు మగపిల్లాడు. మేల్ చైల్డ్!”

రిషి నవ్వాడు.

బిగ్గరగా, నవ్యత మరిచి, మనసులో ముసురుకున్న ఆలోచనలన్నీ తెగి రాలి పోయేట్టు నవ్వాడు.

డాక్టర్ కిషోర్ అలాగే నిలబడి చూస్తున్నాడు. నిమిషం మీద మరో రెండు క్షణాల తరవాత కోలుకుని, “అయామ్ సారీ, డాక్టర్” అన్నాడు.

"ఐయామ్ ఆల్‌సో సారీ— యువర్ సన్ ఈజ్ ఏ డెడ్ బారన్ ఛైల్డ్" అంటూ ముందుకి కదిలాడు.

"డాక్టర్!" వెర్రివాడిలా చూశాడు. వెళ్ళిపోతున్నాడు కిషోర్.

"ప్లీజ్ స్టాప్ దేర్, డాక్టర్!" రెండంగల్లో వెళ్ళి చేరాడు.

"చెప్పండి. ఏమైంది? ఎలా జరిగింది? ఎందుకని జరిగింది?" ఆవేదనగా అడిగాడు. అతనికి పిచ్చెక్కుతున్నట్లే ఉంది.

"జరిగింది... చాలా కేసుల్లో అలా జరుగుతుంటుంది. కారణాలు ఎన్నో ఉంటాయి. మనకు కావలసింది ఫలితం . . ."

"మీరు సరిగా చెప్పడం లేదు. నిజం చెప్పడం లేదు. నా సుశీ ఇప్పుడెక్కడుంది?"

"వార్డు నంబరు త్రీ. సింగిల్ బెడ్." తను చెప్పవలసింది మరేమీ లేనట్లు వెళ్ళిపోయాడు.

రిషి గబగబ వెళ్ళాడు.

గ్లూకోజ్ ఎక్కిస్తున్నారు సుశీలకి. స్పృహలోనే ఉంది. కానీ, నీరసంగా కళ్ళు సగం వాలిపోయి. . .

"సుశీ!"

కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ, "వచ్చారా?" అంది, గ్లూకోజ్ ఓపిక అంతా ఒంట్లోకి వచ్చేసినట్లు.

బలవంతంగా నవ్వాడు.

"మనకి బాబట!" ఆ కళ్ళలో కాంతి చూసి ఉలిక్కిపడ్డాడు.

అయితే, సుశీలకి తెలియదా?!

"నువ్వు బాబుని చూశావా, సుశీ?"

"లేదండీ. నాకు వీళ్ళు చూపించడం లేదు. ఇదెక్కడి ఘోరమండీ? ఇన్ని నెలలు మోసినదాన్ని...మొదటచూడవలసిన దాన్ని నాకు చూపించకుండా. . ."

"సార్! కొంచెం ఇలా వస్తారా?" నర్సు పిలిచింది.

"ఒన్ మినిట్, సుశీ!" బయటికి వెళ్ళాడు.

"చూడండి. మీ మిసెస్ మీకు దక్కాలంటే పిల్లాడిని గురించిన నిజం చెప్పకూడదు. ఆవిడ చాలా బలహీనంగా ఉన్నారు. పిల్లాడికి నలతగా ఉంటే పెద్ద డాక్టర్లు చూస్తున్నారన్న మిష పెట్టాము. మీరూ అదే అనాలి."

తల ఆడించాడు.


"నేనో మాటు బాబుని చూడాలి."

"ఫాలో మీ."

పిల్లల శవాలు ఉంచే గదిలోకి వెళ్ళారు.

ఏదో నంబరు చూసి చెక్కతొట్టె మీద గుడ్డ తీసింది.

# కలుకనే కళ్ళున్నాయి



కాటూరు
రవీంద్ర — త్రివిక్రమ్

రిషి కన్నార్పకుండా చూశాడు. తన గుండె పచ్చడి చేసే వింటూ చూశాడు. బుగ్గల మీదికి జారే అశ్రుకణాలను తుడుచుకోవడం చేతకానివాడిలా చూశాడు.

అచ్చం ఆ ముక్కు, మూసిన కళ్ళు, కనుబొమలు, చెవులు, చిన్న నోరు— సుశీల నోట్లోంచి ఊడిపడినట్లే ఉన్నాడు! నిద్ర పోతున్న వాడిలా ఉన్నాడు. నల్లటి జుత్తు నుదుటి మీదకి తొంగి చూస్తూంది.

అప్రయత్నంగా చేతిని ముందుకి చాపాడు.

మంచు ముక్కలా తగిలింది నుదురు.

వికృతంగా నవ్వుకున్నాడు.

'ఈ చైతన్యం లేని బొమ్మనా తను కోరుకున్నది?'

"పిల్లాడిని తీసుకెళతారా?"

రుమాలుతో మొహం తుడుచుకున్నాడు.

"ఎస్, ప్లీజ్!"

ఏవో, కాగితాల మీద సంతకాలు పెట్టించుకుంది. పొత్తిళ్ళలో పిల్లాణ్ణి తీసుకుని బయటికి వచ్చాడు. డ్రైవరు తెల్లబోయి చూస్తున్నాడు.

"మోసెస్! వీడు నా బిడ్డ. కారులో పడుకోబెట్టు. అమ్మగారికి చెప్పి వస్తాను."

పిల్లాడిని తీసుకుని, చల్లగా తగులుతున్న కాళ్ళు చూసి, "సార్!" అన్నాడు రుద్ధకంఠంతో.

"కార్లో పడుకోబెట్టు, వస్తున్నాను" అంటూ చకచక సుశీల ఉన్న గదిలోకి వెళ్ళాడు.

"చూశారా బాబుని?" ఆత్రంగా అడిగింది.

"చూశాను! అచ్చం నీ పోలికే. పది పౌన్లట. బరువుగానే ఉన్నాడు. నాకు అర్జెంటు పని ఉన్నాయి. మళ్ళీ వస్తాను."

"మీరు వచ్చేదాకా వీళ్ళు నాకు బాబుని చూపించరేమో. మీరు కాస్త చెప్పి వెళ్ళరూ?"

"డాక్టర్ల కంటే నాకు ఎక్కువ తెలుసా, సుశీ, నీ పిచ్చిగానీ. నీ ఆత్రత నా కన్నా వాళ్ళకే బాగా తెలుసు. వాళ్ళని వేధించకు. ఎప్పు డేది, ఎలా చెయ్యాలో వాళ్ళకు తెలుసు. ప్లీజ్! టేక్ రెస్ట్."

తిరిగి వచ్చేశాడు.

అక్కడ ఉండలేడు. సుశీలని ఓదార్చడం తనకి చేతకాదు. కార్లో కూర్చున్నాడు. బరువుగా కదలి బయలుదేరింది.

ఏమి టీ జీవితం?

ఎందు కిలా అవుతుంటుంది?

ఎవరు చెబుతారు దీనికి సమాధానాలు?

చేతుల్లో మొహం కప్పుకుని ముందు సీటు మీద వాలాడు. పక్కన చలనం లేని తన రక్తం!

ఇల్లు వచ్చిందని మోసెస్ చెప్పే వరకూ కళ్ళు తెరవలేదు.

పిల్లాడిని మోసెస్ ఇంట్లోకి ఎత్తుకు వచ్చాడు.


వంటావిడ పెద్దవయసుది. చత్వారం, చాదస్తంకూడా ఉన్నాయి. మొదట అర్థం కాలేదు.

తరవాత శోకంతో ఇల్లు అదర గొట్టేసింది.

వి ' విరాకుపడ్డాడు.

అతని కిలాంటి గందరగోళం నచ్చదు.

బాధ తనది, బాదరబందీ ఇతరులది ఎందుకు కావాలి?



రేఖాసుందరి చిత్రం— కొరసల సత్యనారాయణస్వామి

వంటావిడ శాంతించి, వంటింట్లోకి వెళ్ళిపోయింది.

పిల్లాడిని సోఫాలో పడుకోబెట్టి మోసెస్ వెళ్ళిపోయాడు.

అప్పుడు తీశాడు— తను ఫ్యాన్సీ ఖరీదయిన లాగూ, చొక్కా. తొడిగాడు. ఊలు టోపీ పెట్టి స్వెట్టరు, మేజోళ్ళు కూడా తొడిగాడు.

డైరీలో రాసుకున్న పది పేరు కాగితాన్ని చించి, స్వెట్టరులో పెట్టాడు.

పిల్లాణ్ణి చేతుల్లోకి ఎత్తుకుని గదులన్నీ తిప్పాడు. బాల్కనీ, బెడ్ రూమ్, పూజగది— ఆగిపోయాడు.

నవ్వుతున్న కృష్ణ విగ్రహం ముందు దాదాపు పాదాల చెంత పడుకోబెట్టి, మౌనంగా కూర్చున్నాడు.

తనకి తెలుసు.

అక్కడ ఏ మహాద్భుతమూ జరిగిపోదు.

అభయం పలుకుతున్న శ్రీకృష్ణుని దివ్యహస్తంలో నుండి ఏ దివ్య తేజస్సు ఉద్భవించి, తన బాబులో ప్రవేశించి చైతన్యవంతం చెయ్యదు. అయినా, కూర్చున్నాడు. ఎందుకో తెలియదు. మనసంతా ఖాళీ. కనీసం ఆ దేవుణ్ణి ప్రార్థించడం కాకపోయినా, బాధకోద్దీ నిందించనూ లేదు.

మళ్ళీ తనే లేచి పిల్లాడిని తీసుకుని క్రిందికి దిగి వచ్చాడు.

మరబొమ్మలా, మౌనంగా, నిబ్బరంగా ఒక్కొక్క మెట్టే దిగుతున్న రిషిని, అతని చేతిలోని పిల్లవాడి శవాన్ని ఆఫీసు స్టాఫంతా చూశారు. అందరి వెనక తల దించుకుని మోసెస్ నిలబడి ఉన్నాడు.

చివరి మెట్టుమీద నిలబడి మరి ముందుకి కదల్లేదు రిషి. హెడ్ క్లర్కు సీతారామయ్య ముందుకి వచ్చి పిల్లాణ్ణి అందుకున్నాడు.

"పిల్లాణ్ణి కాంపౌండ్‌లోనే ఖననం చెయ్యాలి." మెల్లగా అన్నాడు రిషి.

మోసెస్ ముందు నడిచాడు.

ఆ రాత్రి—

అటు ఆస్పత్రిలో ఉన్న సుశీల పదే పదే పిల్లాడిని ఊహించుకుంటూ కళ్ళు తెరిచి కలలు కంటూంది. ఇటు రిషి పక్కమీద అశాంతిగా కదులుతూ, కళ్ళు మూసుకున్నా నిద్ర రాక, కలతబారిన మనసుతో దిండు తడుపుతున్నాడు.

ఊరికి పెడగా, పచ్చని పైర్లకు సమీపంగా ఉన్న అతని బంగళా ఆవరణలోకి దూరిన నక్కొకటి ఆత్రంగా కొత్తగా పోసిన మట్టిదిబ్బకి బొరియ చేస్తూంది. *